క్లుప్తంగా

స్వామిత్వ సర్వేపై శిక్షణ



దుగ్గిరాల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం స్వామిత్వ ప్రోగ్రాం ఇన్‌చార్జి బోయేజుబాబు సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ స్వరూపరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెనాలి డివిజన్‌లోని ఏడు మండలాల్లో ప్రతి మండలంలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు, ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్‌లు, నలుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు మొత్తం పది మంది చొప్పున హాజరయ్యారు. భూముల రీ–సర్వేని ఏ విధంగా చేయాల్లో వారికి వివరించారు. అనంతరం ఫీల్డ్ వెరిఫికేషన్‌కు సమీప గ్రామాలకు దేవరపల్లి అగ్రహారం, చింతలపూడి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారులు, పంచాయతీ అధికారులు స్వరూపరాణి, నెహ్రూ, గోపాలరావు, జాహ్నవి, సిబ్బంది పాల్గొన్నారు.

12న మహా ధర్నాను జయప్రదం చేయాలి

దుగ్గిరాల: మండలంలోని మంచికలపూడి గ్రామంలో శనివారం కార్మికులతో సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు సమావేశమయ్యారు. ఈ నెల 12న విజయవాడలో జరిగే మహా ధర్నాకు వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీలు పెద్ద ఎత్తున హాజరు కావాలని అభ్యర్థించారు. గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు పెంచాలని, జాబ్ కార్డు కలిగిన ఒకరికి పని చూపాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25 లక్షల మంజూరు తదితర డిమాండ్లను వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జెట్టి బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: గుంటూరులోని రాష్ట్ర వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శనివారం ఉండవల్లిలో ప్రజా సంఘాల కార్యాలయంలో రాజధాని రైతు సంఘం కమిటీ సమావేశాన్ని తక్కెళ్లపాటి భక్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు అప్పగించడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో 11 కోట్ల మంది రైతులను భూముల నుంచి దూరం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రైతు సంఘం నాయకులు గణేష్, కోటేశ్వరరావు, దండమూడి సాంబశివరావు, గాంధీ, రామారావు పాల్గొన్నారు.

'ఎన్నారై'లో మ్యాడ్ 2 చిత్ర బృందం



మేడికొండూరు : స్థానిక ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఫెస్ట్ సరితం 2కే25 రెండో రోజు ఘనంగా నిర్వహించారు. శనివారం మ్యాడ్ 2 చిత్ర బృందం కళాశాలలో అలరించింది. డైరెక్టర్ కల్యాణ్ శంకర్, హీరోలు నార్నే నితిన్, సంగీత్ శోభన్ తో పాటు ప్రియాంక జవాల్కర్ పాల్గొన్నారు. ఈ నెల 28న రిలీజ్ కానున్న చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్ , ప్రొఫెసర్ కోటేశ్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు వివిధ శాఖ అధిపతులు వైస్ ప్రిన్సిపల్ శ్రీహరిరావు, చంద్రమౌళి, నాగేశ్వరావు, రెహమాన్ కేసర్ సౌజన్య పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలోని రేగుతోటలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న తుళ్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు అమరావతి మండలం ధరణికోటకు చెందిన ధనేకుల వెంకటేశ్వరరావు (53)గా గుర్తించారు. అతను గత నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో తప్పిపోయాడని కుటుంబ సభ్యులు గుర్తించారు. శనివారం రేగుతోటలో మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులకు జేబులో ఆధార్ కార్డు లభించడంతో బంధువులకు సమాచారం అందించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్లు తుళ్లూరు ఎస్ఐ కలగయ్య తెలిపారు.

పశువైద్యశాలలో విద్యుత్ కనెక్షన్ తొలగింపు

దుగ్గిరాల: మండలంలోని పేరుకలపూడి గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం పశు వైద్యశాలలో విద్యుత్ ఫీజును అధికారులు తొలగించారు. బీసీ నాయకుడు అక్కు మహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా.. విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో పశు వైద్యశాలలో విద్యుత్ అధికారులు వచ్చి ఫీజు తొలగించడం దురదృష్టమన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూ అధికారం అనుభవిస్తూ కనీసం చెల్లించాల్సిన బకాయిలు కూడా చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పశు వైద్యశాలలో కొన్ని మందులు శీతలీకరణలో ఉంచాలి కాబట్టి కరెంట్ లేకపోవడం వల్ల అవి చెడిపోయే ప్రమాదం ఉందన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు
- సేవలందించిన మహిళలకు సన్మానాలు



క్రీడాకారిణి ప్రణీతను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ఆకాశంలో ఆమె సగం.. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళ లేనిదే మనుగడ లేదని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ కుటుంబం వృద్ధి చెందాలన్నా, పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరాలన్నా మహిళ ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ భూమి మీద అన్నిటికన్నా ప్రధానం మాతృమూర్తి అన్నారు. ఐటీ, క్రీడా, విద్యా రంగాల్లో పురుషులను మించి మహిళలు రాణించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా.. పిల్లలను రక్షించుకుంటూ కుటుంబ గౌరవాన్ని కాపాడేది మహిళలే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్‌కు సెలెక్ట్ అయిన తాడేపల్లి మహానాడుకు చెందిన క్రీడాకారిణి ప్రణీతను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, మండల అధ్యక్షుడు అమరా నాగయ్య, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, దుగ్గిరాల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చిలువూరు ఫిలోమీనా, మాజీ కౌన్సిలర్లు మేకా పావని, దర్శి విజయశ్రీ పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యురాలు అనూషకు రోటరీ ఐకానిక్ అవార్డును మంగళగిరి రోటరీ క్లబ్ శనివారం అందజేసింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యుపీహెచ్‌సీలో వేడుకలు నిర్వహించారు. ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న అనూషను పలువురు శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. మహిళలకు వైద్యురాలు అనూష జీవితం స్ఫూర్తి దాయకమని కొనియాడారు.

తాడేపల్లిరూరల్ : ప్రకాష్ నగర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు శ్రామిక మహిళలకు కనీస వేతనాలు అమలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె. తంబీరాణి, సుజాత, నిర్మల, లీల, కిరణ్మయి, లక్ష్మి, అశ్వని, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మండలంలోని మంచికలపూడి గ్రామంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సీపీఎం మహిళా విభాగం మండల అధ్యక్షురాలు స్వర్ణ గౌరి పాల్గొని, మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రిక, దుర్గా భవాని, వై.తనూజ పాల్గొన్నారు.

- చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాశాల కార్యదర్శి చందు విజయలక్ష్మి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్ : మహిళలకు గౌరవప్రదంగా జీవించే హక్కు ఒకరు ఇచ్చే భిక్ష కాదని... అది హక్కు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సమైక్య అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఏపీ రాష్ట్ర మహిళా సమైక్య జెండాను రాష్ట్ర మహిళా సమైక్య నాయకురాలు సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అత్తిలి విమల మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, మానభంగాలు, దౌర్జన్యాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని శిక్షించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సమైక్య పట్టణ అధ్యక్షురాలు చిన్ని శివకుమారి, విజయవాడ నగర కార్యదర్శి దుర్గాంబ, మంగళగిరి నియోజకవర్గ నాయకులు జొన్నాదుల భారతి పాల్గొన్నారు.

- **ఫిరంగిపురం:** జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తి రేణమ్మ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యురాలు పి.జోస్ఫినా, వార్డు మెంబర్లు, పారిశుద్ధ్య కార్మికులను సర్పంచ్ మేడాబాబు, ఈవో ఏకే బాబు ఘనంగా సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరాలి



మహిళలను సత్కరిస్తున్న వైద్యులు



చలపతి కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు

తాడికొండ: మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరాలని తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ఎన్‌జీవో అమరావతి, ఉమెన్ వింగ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో నిర్వహించిన వేడుకలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. పలువురు మహిళా వైద్యులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఎన్.వసుంధర, డాక్టర్ టి.శివపార్వతి, శ్రీఅమరావతి యూనిట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి షేక్ అబ్దుల్ సీహెచ్‌వో జి.వెంకట రమణ, ఎన్.అంజమ్మ, జ్యోత్స్న, జీవీ రాజేశ్వరి ఏఎన్ఎంలు, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.

- మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో కాటూరి మెడికల్ కళాశాల గైనకాలజిస్ట్ డాక్టర్ వీణ మాధురి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చలపతి విద్యా సంస్థల కోశాధికారి వై.అనంతకుమారి మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో రాణించాలన్నారు. అతిథులతో పాటు పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ బి.తులసీ రాణి, సభ్యులు డాక్టర్ సి.ప్రమీల రాణి, డాక్టర్ ఆర్.అరుణ, ఎ.లలిత పాల్గొన్నారు.
- తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.సమతావాణి, ఎంఈవో తెనాలి ఇందిర, ఏపీఎం ఆర్.సాంబశివరావు పలువురు డ్వాక్రా మహిళలు మహిళా దినోత్సవాల్లో పాల్గొన్నారు. సుస్థిర వ్యవసాయం- మహిళల పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించి, పలువురు అధికారులను ఘనంగా సత్కరించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

- ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు, కార్మికులకు సన్మానం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు



కోలాటం ఆడుతున్న మహిళా ఉద్యోగులు, అధికారులు



బహుమతులు అందుకుంటున్న మహిళా ఉద్యోగులు

మంగళగిరి టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రెండు రోజులుగా మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధికారులు సైతం మహిళలతో కోలాటం ఆడి మహిళా దినోత్సవాన్ని ఉల్లాసభరితం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ వైద్యురాలు అనూషకు సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న వేముల దుర్గారావు



మాట్లాడుతున్న మహిళా సమైక్య అధ్యక్షురాలు అత్తిలి విమల



జెడ్పీటీసీ కత్తి రేణమ్మ, మహిళా కార్మికులకు సన్మానం

కేఎల్‌యూలో సురభి వేడుకలు



రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌ను సత్కరిస్తున్న వీసీ జి.పార్థసారథి వర్మ



మ్యాడ్ స్క్వేర్ చిత్ర బృందం

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సురభి–2025 వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మ్యాడ్ స్క్వేర్ సినిమా హీరో నరేన్ నితిన్, హీరోయిన్ ప్రియాంకా జ్వాలాకర్, సినిమా నిర్మాత హారిక, లైఫ్ సినిమా హీరో శ్రీహర్ష, సినిమా డైరెక్టర్ పవన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ చరణ్ మాట్లాడుతూ కొడుకుతో తండ్రికి ఉండే అనుబంధాన్ని ప్రత్యేక కోణంలో ఈ చిత్రంలో చూపారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ విచ్చేసి మాట్లాడారు. తన కళాశాల రోజులను గుర్తుచేసుకున్నారు. మిస్సెస్ ఆసియా రితిక వినయ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ కేఎల్‌యూలో వందశాతం ఉద్యోగాల కల్పన ఉంటుందన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆయా యూనివర్శిటీలు, కళాశాలల విద్యార్థులు ఈ వేడుకలకు హాజరయ్యారని తెలిపారు. వర్శిటీలో స్టూడెంట్ యాక్టివిటీ రంగంలో సుమారు 43 క్లబ్‌లు ఉన్నాయని చెప్పారు. 2023–2024లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉత్తమ అధ్యాపకులకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, సురభి చైర్ పర్సన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, కన్వీనర్లు పి. సాయి విజయ్, డాక్టర్ ఎం. సుమన్, డాక్టర్ వి. కృష్ణారెడ్డి, అన్ని విభాగాల డీన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

95వ రోజు ఏసీసీ కార్మికుల దీక్ష

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శనివారం 95వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రారంభించి, మాట్లాడారు. మహిళా సాధికారత గురించి గొప్పగా చెబుతున్న పాలక పార్టీలు మహిళలకు చేసింది ఏమీ లేదన్నారు. కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన నష్ట పరిహారం కోసం దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు.మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కార్మికులు రమణ, సాంబయ్య, అంకయ్య, ఆశీర్వాదం, సారమ్మ, రమాదేవి, ఇమాంబి, నాగమల్లేశ్వరి, దుర్గా భవాని, గురవయ్య, అగ్గయ్య పాల్గొన్నారు.

దొంతిరెడ్డికి సన్మానం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తాడేపల్లి పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కళ్లం రాజశేఖరెడ్డి కేంద్ర టెలి కమ్యూనికేషన్ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. తన మీద నమ్మకం ఉంచి దొంతిరెడ్డి వేమారెడ్డి తనకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రుక్మాంగరెడ్డి, సీనియర్ నాయకుడు గాంధీ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

ఫిరంగిపురం: ఫిరంగిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మరమ్మతులు నిర్వహించినట్లు విద్యుత్‌శాఖ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. వేములూరిపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఏబీ వర్క్‌లు నిర్వహించారు. దారిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించారు. పలుగ్రామాల నుంచి వచ్చిన 12 మంది సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

కన్నీరు ఒక్కటే తక్కువ



పూర్తిగా ఎండిపోయి బురదతో దర్శనమిస్తున్న సాగర్ కాల్వ



నీరులేక ఎండిపోతున్న మిరప పైరు

- సాగర్ కాల్వలకు విడుదల కాని సాగునీరు
- బండారుపల్లి మేజర్ కాల్వ పరిధిలో ఎండుతున్న మిర్చి పంట
- కుంటలు, కాల్వల్లో అడుగంటిన నీరు
- అధికారుల నిర్లక్ష్యంతో కంటతడి పెడుతున్న రైతులు

తాడికొండ: ఆరు గాలాలు శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో ఎండిపోతుండటంతో రైతులు కంటతడి పెడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేకపోవడంతో మిర్చి పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. గత నాలుగు నెలలుగా వరుణుడు పూర్తిగా ముఖం చాటేయడంతో.. మిర్చి సాగు చేసిన రైతుల పరిస్థితి దైన్యంగా మారింది. కాల్వలకు సకాలంలో నీటిని విడుదల చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. అరకొరగా నీటిని వదలడంతో అవి ఎగువ ప్రాంతాల రైతులకే సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో బండారుపల్లి మేజర్ పరిధిలోని ఫిరంగిపురం, మేడికొండూరు, తాడికొండ మండలాల పరిధిలో వేలాది ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేసిన రైతులు నీరు ఎప్పుడు విడుదల చేస్తారా అని ఎదురు చూపులు చూస్తున్నారు.

అడుగంటిన కాల్వలు, కుంటలు

సాగర్ కాల్వల్లో నీటిని విడుదల చేయకపోవడంతో..స్థానికంగా ఉన్న కుంటలు, కాల్వల్లో అడుగున ఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్లతో తోడి పంటలకు పెట్టుకున్నారు. సాగునీటి సమస్యపై ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఇటీవల నూతనంగా ఎన్నికైన డిస్టిలరీ కమిటీలను కూడా రైతులు సంప్రదించారు. కానీ ప్రయోజనం శూన్యమని వారు వాపోతున్నారు. ఒక్క చుక్క నీటిని కూడా సాగర్ కాల్వలకు విడుదల చేసిన దాఖలేవని మండిపడుతున్నారు. ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించి పంటలు నిలబెట్టుకున్నామని, తీరా ఇప్పుడు సాగునీరు విడుదల చేయకపోతే తమకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇకనైనా స్పందించి, బండారుపల్లి మేజర్‌కు సాగునీటిని విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ఫిరంగిపురం: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తక్కెళ్లపాడుకు చెందిన చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (60) వ్యవసాయం చేస్తున్నాడు. ఆరు నెలల కిందట భార్య అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో అతను మానసికంగా దిగులు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో పురుగు మందు తాగిన వెంకటేశ్వరరెడ్డిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు.

పదవ తరగతి విద్యార్థుల ఘర్షణ

మత్తు పదార్థాలకు బానిసవుతున్న వైనం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గేటు సెంటర్ వద్ద ఉన్న కళ్లం అంజిరెడ్డి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల మధ్య శుక్రవారం జరిగిన ఘర్షణ.. ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఓ విద్యార్థి చెడు వ్యసనాలకు అలవాటు పడి మరో విద్యార్థిపై దాడిచేశాడు. ఈ దాడిని ప్రశ్నించడంతో సదరు విద్యార్థిని చితకబాదాడు. ప్రశ్నించిన తోటి విద్యార్థులపై దాడి చేయించేందుకు అంజిరెడ్డి కాలనీ నుంచి కొంతమందిని పిలిపించి, ఘర్షణకు దిగి వీరంగం సృష్టించాడు. అక్కడ ఉన్న పెద్దలు ఘర్షణ పడుతున్న వారిని అక్కడి నుంచి పంపించిచేశారు. అయితే.. పాఠశాలలో చదువుతున్న కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తోటి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. చెడు వ్యసనాలకు అలవాటు పడిన ఆ విద్యార్థులకు అంజిరెడ్డి కాలనీకి చెందిన కొంతమంది ఆకతాయి యువకులు వత్తాసు పలుకుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పాఠశాల ముగిసిన తర్వాత రైల్వే ట్రాక్‌ల వెంబడి ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, గతంలో కూడా ఓ విద్యార్థిపై కొంతమంది యువకులు వచ్చి దాడి చేశారని సమాచారం. పాఠశాల వదిలిన సమయంలో విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయంలో ఉపాధ్యాయులు నిఘా ఏర్పాటు చేయాలని, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈద్గా పక్కనే మద్యం దుకాణం

అడ్డుకున్న ముస్లింలు



మద్యం దుకాణం వద్ద ముస్లింల వాగ్వాదం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల జంక్షన్ నుంచి గ్రామాల్లోకి వెళ్లే రహదారి మధ్యలో ఈద్గా పక్కనే నూతనంగా మద్యం షాపు ఏర్పాటును పేరేచర్ల గ్రామానికి చెందిన ముస్లింలు శనివారం అడ్డుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి మద్యం షాపు టెండర్ పేరేచర్లకు దక్కింది. లైసెన్స్ పొందిన వ్యక్తి నుంచి మరో వ్యక్తి సబ్ కాంట్రాక్టు నిర్వహణకు ఒప్పందం కుదుర్చుకుని షాపు ఏర్పాటుకు సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న ముస్లింలు తాము పవిత్రంగా భావించే ఈద్గా పక్కనే మద్యం షాపు ఏర్పాటును అడ్డుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం కావడంతో ఈద్గా పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించారు. మద్యం షాపు ఏర్పాటు నిర్వాహకులు తాత్కాలికంగా నిలిపివేశారు.